సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



అడుగంటిన నీళ్లు..

పంట చేతికొచ్చే దశల ఎండిపోతుండటంతో రైతులు కన్నీరు పెడుతున్నారు.

వివరాలు 8లో ▸



శభాష్.. పోలీస్

కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని పోలీసులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు.

వివరాలు 8లో ▸



జర జాగ్రత్త..

మధ్యాహ్నం నుంచి సెలవు కావడంతో పిల్లలు ఆటలాడేందుకు బయటకు వెళ్లడం సహజం.

వివరాలు 9లో ▸

గాలి వాన బీభత్సం

- కొన్ని మండలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు
- ట్రాఫిక్, విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేలరాలిన మామిడి కాయలు
- వరి, జొన్న పంటలకు భారీ నష్టం



హద్నూర్‌లో విరిగిపోయిన స్తంభం



కురిసిన వడగళ్లు

సంగారెడ్డి జోన్/న్యాల్‌కల్(జహీరాబాద్)/కల్హేర్(నారాయణఖేడ్)/నారాయణఖేడ్/వట్‌పల్లి(అందోల్)/మునిపల్లి(అందోల్): జిల్లాలో గురువారం పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడటంతో పలు మండలాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని మండలాల్లో జొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.
సంగారెడ్డి పట్టణంలో బలమైన ఈదురుగాలులు వీస్తూ ఓ మోస్తారుగా వడగళ్ల వర్షం కురిసింది. జహీరాబాద్‌లోని న్యాల్‌కల్ మండలంలో ఈదురు గాలులలతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. హద్నూర్, గుంజోటి, రాంతీర్థ్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. చెట్లు విరిగిపోయి రోడ్లపై పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా పలు గ్రామాల్లో జొన్న పంట నేలవాలింది. ఇక నారాయణఖేడ్‌లోని కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో ఖానాపూర్(కె), బీబీపేట్, పోచాపూర్ శివారులో పంట పొలాల్లో వరి పంట నేలవాలింది. కృష్ణాపూర్, ఇందిరానగర్ వద్ద రోడ్లపై ఆరబెట్టిన జొన్న కంకులు తడిచిపోయాయి. మహదేవుపల్లిలో వర్షం ధాటికి ఇళ్లపై రేకులు ఎగిరిపడ్డాయి. బాచేపల్లిలో రామాలయం వద్ద జాతరలో దుకాణాలు ఎగిరిపోయాయి. దీంతో కుస్తీ పోటీలు రద్దు చేశారు. అందోలు మండలంలో పలు చెట్ల కొమ్మలు విరిగి పడగా, మామిడి కాయలు నేలరాలాయి. పంట పొలాలకు వెళ్లే దారికి అడ్డంగా చెట్ల కొమ్మలు పడటంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

నారాయణఖేడ్ నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పట్టణంలోని పలు హోటళ్లు, ఇళ్లపైకప్పులు ఎగిరిపడ్డాయి. పట్టణంతోపాటు పంచగామ కమాన్ ప్రాంతంలో విద్యుత్ వైర్లు దెబ్బతినడంతో 2.30 గంటల నుంచి 7.30గంటల వరకు కరెంటు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మామిడి కాత రాలిపోయింది. పలు మండలాల్లో వరి, జొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మాద్వార్‌లో ఇళ్లపైకప్పు రేకులు ఎగిరిపడటంతోపాటు పలు చెట్లు విరిగి పడ్డాయి. నిజాంపేట్‌లో వరదనీరు రోడ్లపై ఉధృతంగా ప్రవహించింది. మునిపల్లి మండలంలోని ఈదురు గాలులకు ఇండ్లపై కప్పులు, రేకులు ఎగిరిపడ్డాయి. విద్యుత్ తీగల కింద చెట్లు ఉండటంతో చెట్ల కొమ్మలకు విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో ఇళ్లలో షార్ట్ సర్క్యూట్‌తో ఆయా గ్రామాల్లో టీవీలు, విద్యుత్ బల్బులు, మోటార్లు కాలిపోయాయి.

సిర్గాపూర్‌లో అత్యధిక వర్షపాతం...

కురిసిన భారీ వర్షంతో రాష్ట్రంలోనే సిర్గాపూర్ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదైంది. మండలంలో అత్యధికంగా 41.8మి.మీ నమోదైంది. నాగల్‌గిద్దలో 30.0మి.మీ, నారాయణఖేడ్‌లో 19.3మి.మీ, న్యాల్‌కల్‌లో 20.5మి.మీ, సంగారెడ్డిలో 15.3, జహీరాబాద్‌లో 10.8, కంగ్టిలో 9.0, కల్హేర్‌లో 6.3, మనూరులో 5.8 మి.మీ వర్షపాతం నమోదైంది.



బాచేపల్లిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



నారాయణఖేడ్‌లో నేలరాలిన వరి

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేకు ఆహ్వానం



చింతా ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రికను ఇస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

సంగారెడ్డి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ 134వ జయంత్యుత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 14 నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను అంబేడ్కర్ ఉత్సవ కమిటీ కోరింది. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 14న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహార్యాలీ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

బీఆర్‌ఎస్ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి : హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పట్టణ, మండల నాయకుల కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇందుకు సంబంధించిన సభ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్‌లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలనలో కాంగ్రెస్ విఫలం

ఎమ్మెల్యే మాణిక్‌రావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్ టౌన్: వరంగల్ ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజోత్సవ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు పిలుపు నిచ్చారు. క్యాంప్ కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌తో కలిసి గురువారం రజోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలోలేరని చెప్పారు. రజోత్సవ సభలో కేసీఆర్ ప్రజల భవిష్యత్ గురించి దిశా నిర్దేశం చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తట్టునారాయణ, గుండప్ప, నామ రవికిరణ్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదును అందజేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్లో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హరీశ్‌రావుపై ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... బుధవారం గణేశ్‌గడ్డ దేవస్థానం వద్ద జరిగిన సమావేశంలో హరీష్‌రావు హెచ్‌సీయూ విద్యార్థులపై నమోదైన కేసుల గురించి మాట్లాడుతూ.. 'ముఖ్యమంత్రి కేసులు పెట్టిస్తే ఉప ముఖ్యమంత్రి కేసు ఉపసంహరించుకుంటాడంట అంటూ..తోక కుక్కను ఆడిస్తుందో లేక కుక్క తోకను ఆడిస్తుందో అర్థం కావడం లేద'ని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. భట్టి విక్రమార్కను కుక్కతో పోల్చి దళితుల మనోభావాలను దెబ్బతీసిన హరీశ్‌రావు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కదిలేదేలే!



పటాన్‌చెరు పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఏళ్లుగా అధికారుల తిష్ట

- అధికారులపై ఎన్ని ఆరోపణలు వచ్చినా చర్యలు శూన్యం
- ఫిర్యాదులు వస్తేనే ముందుకొస్తున్న అవినీతి నిరోధకశాఖ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లాలోని హైదరాబాద్ నగరాన్ని ఆనుకుని ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలల్లోని పోస్టింగ్‌లకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఈ ప్రాంతంలో ఉద్యోగాలు చేసేందుకు వివిధ శాఖల ప్రభుత్వాధికారులు పోటీలు పడుతున్నారు. అందుకోసం వారికున్న పలుకుబడిని సైతం ఉపయోగిస్తున్నారు. ఎవరికైనా పనులు కావాలంటే ఇక సదరు అధికారుల ఇష్టారాజ్యం నడుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇదే ప్రాంతంలో వారు ఉద్యోగం చేసేది వారి సొంత లాభాల కోసమా లేక ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యమో తెలియడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతంలో పనిచేసే అధికారులపై అనేక అవినీతి ఆరోపణలున్నప్పటికీ అధికారులపై పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎవరి పైరవీలు వారివే..

నియోజకవర్గం పరిధిలోని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పోలీసు వివిధ శాఖలలో పని చేసే అధికారులు ఈ ప్రాంతాలలో పోస్టింగ్‌ల కోసం పోటీ పడుతున్నారు. అందుకోసం హైదరాబాద్‌లోని రాజకీయనాయకులు, ప్రముఖుల సిఫారుసులు తీసుకుని ఇక్కడికి బదిలీపై వస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అందుకు ఎంత ఖర్చు చేసేందుకైనా వెనుకంజ వేయడం లేదని స్థానికులు, రాజకీయ నాయకులు గుసగుసలాడుతున్నారు. మరికొంతమంది ఎన్ని ఆరోపణలున్నా ఇక్కడి నుంచి బదిలీలు కాకుండా పైరవీలు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ప్రజలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

ఇక్కడ పని చేస్తే అంతే..

ఈ ప్రాంతంలో ఏ ప్రభుత్వ శాఖను తీసుకున్నా ఒకసారి పని చేశారంటే ఇక ఆ అధికారి ఈ ప్రాంతాన్ని వదిలివెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. మరికొంతమంది అధికారులు ఈప్రాంతంలో పని చేసి ఇతర ప్రాంతాలకు బదిలీ అయినా తిరిగి ఈ ప్రాంతంలోనే పోస్టింగులు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

సమస్యలు పట్టించుకోని దుస్థితి

స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో వివిధ శాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వారి సొంత లాభాలు చూసుకోవడం తప్ప సమస్యలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చేసేదేమీ లేక స్థానికులు ప్రధాన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకునిపోతున్నారు.

> **ఆరోపణలున్నా చర్యలు శూన్యమే..**
>
> ప్రధాన శాఖలలో పని చేసే అధికారులపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ వారిపై పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, మున్సిపల్ శాఖలలో పనిచేసే కొంతమంది అధికారులు తమని ఎవరూ ఏమి చేయలేరని బహిరంగ సవాళ్లు కూడా విసురుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తమను బదిలీలు చేయడం అంత ఆషామాషీ కాదనీ తమంతట తాము వెళ్తే తప్ప తమను ఎవరు బదిలీ చేయలేరని ప్రజలకు, రాజకీయ నేతలకు సవాళ్లు విసురుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఆసక్తి చూపడానికి కారణాలు ఇవేనా

పటాన్‌చెరు నియోజకవర్గం మహానగరానికి అనుకుని ఉండటం వల్లే చాలామంది అధికారులు ఇష్టపడుతున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందటంతోపాటు మెరుగైన సౌకర్యాలు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. వారి పిల్లల భవిష్యత్తుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందన్న ఆలోచన పలువురి అధికారులలో ఉన్నది.

రైతులకు అండగా కాంగ్రెస్

- రూ.170 కోట్లతో సింగూరు కాలువలకు సీసీ లైనింగ్
- విద్య,వైద్య హబ్‌గా అందోల్ నియోజక వర్గం
- మంత్రి దామోదర రాజనర్సింహ



జోగిపేటలోని శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రికి ఫొటోను అందజేస్తున్న నిర్వాహకులు

సంగారెడ్డి/జోగిపేట(అందోల్) : రైతులకు అండగా ఉండేది, వ్యవసాయాన్ని పండగగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. జోగిపేట్ డివిజన్‌లో గురువారం జరిగిన ఆత్మ కమిటీ ప్రమాణస్వీకారానికి మంత్రి హాజరై చైర్మన్ తిమ్మారెడ్డి గారి మల్లారెడ్డి తో పాటు 23 మంది డైరెక్టర్లను అభినందించారు. అంతకుముందు జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో అందోల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత శ్రీ జోగినాథ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా జరిగిన శివ పార్వతుల కల్యాణోత్సవానికి హాజరయ్యారు. ఆలయ పూజారులు మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...సింగూరు లిఫ్టు ప్రాజెక్టు శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే రూ.170 కోట్లతో సీసీ లైనింగ్ పనులను చేపడుతున్నట్లు వివరించారు. విద్య వైద్య హబ్‌గా అందోల్ నియోజకవర్గాన్ని తీర్చి దిద్దుతామని తెలిపారు. సుల్తాన్పూర్ జేఎన్టీయూ త్వరలో విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందుతుందన్నారు. చౌటకూర్ మండలానికి పీహెచ్, అంబులెన్స్, పోలీసుస్టేషన్, కేజీబీవీ, పాఠశాలను మంజూరు చేస్తానని హామీనిచ్చారు.

జిల్లాలో 218 వరి కొనుగోలు కేంద్రాలు

రైతులు సన్నరకం వరి ధాన్యంను పండించాలని రాష్ట్ర ప్రభుత్వం సన్న రకానికే ప్రోత్సహిస్తుందని మంత్రి దామోదర స్పష్టం చేశారు. జిల్లాలో 218 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 107 వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీ పేద కుటుంబానికి సన్న బియ్యం అందించాలన్న ఆలోచనతో సీఎం శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామని వివరించారు.జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కర్ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం వరి గ్రేడ్ 1 రకానికి 2230, సాధారణ రకానికి 2300 మద్దతు ధర కల్పిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రకారం సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మాధురి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు అంజయ్య, సుహాసిని రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అంజిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులూ దుర్గారెడ్డి, గోవర్ధన్, రామచంద్రారెడ్డి ,లక్ష్మారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే కంట్రోల్‌రూమ్



కలెక్టర్ వల్లూరు క్రాంతి

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి. చిత్రంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, ఎల్‌ఆర్‌ఎస్, రాజీవ్ యువ వికాసం పథకం, తాగునీటి ఎద్దడి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్ సెల్ నంబర్ 08455 276155 నంబర్‌కు డయల్ చేసి సమస్యల పరిష్కరించుకోవాలని జిల్లా ప్రజలను గురువారం ఓ ప్రకటనలో కోరారు.

> **కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు**
>
> కలెక్టరేట్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అధికారులతో కలసి కలెక్టర్ క్రాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధూరి, డీఆర్‌ఓ పద్మజరాణి, ట్రిసా అధ్యక్షుడు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి



మండల కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్ : మండలంలో వివిధ సమస్యలపై వచ్చేవారికి త్వరగా పరిష్కరించాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండలంలోని వివిధ గ్రామాల నుంచి సమస్యలపై వచ్చే వారికి క్షుణ్ణంగా సమస్యలకు పరిష్కారం చెప్పాలన్నారు. మట్టి అక్రమ రవాణాపై ప్రతీ విభాగం తనిఖీలు చేయాలని సూచించారు. కుల,ఆదాయ, నివాస ధ్రువపత్రాలను త్వరగా మంజూరు చేయాలని చెప్పారు. ఆర్డీవో వెంట మండల అధికారులు,సిబ్బంది తదితరులున్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

జిల్లాలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పోషణ పక్షం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలలో పోషకాహారలోపాన్ని గుర్తించి, నివారించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలకు పోషకాహార విలువలు, పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ఈ నెల 8న ప్రారంభమైన ఈ అవగాహన కార్యక్రమాలు 22 వరకు కొనసాగనున్నాయి. సంగారెడ్డి జోన్:

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన వివరాలు

ప్రాజెక్టు పేరు	గర్భిణులు	బాలింతలు	0-5లోపు చిన్నారులు
జోగిపేట	1,986	1,964	13,086
నారాయణఖేడ్	1,332	1,269	16,690
పటాన్‌చెరు	1,693	1,375	21,707
సదాశివపేట	2,911	2959	16,455
జహీరాబాద్	1,731	1,445	27,337

- ఈనెల 8 నుంచి ప్రారంభమైన పోషణ పక్షం
- 22 వరకు అంగన్‌వాడీల్లో కార్యక్రమాలు
- పౌష్టికాహారంపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన

తల్లిపాల ఆవశ్యకతను వివరించేలా

ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా శిశువు జన్మించి మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించడం, పౌష్టికాహారలోపం ఉన్న చిన్నారులను గుర్తించడం, అనుబంధ పోషకాహారం కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేయడం వంటివి చేస్తారు. ఇప్పటికే మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలకు బరువులు తీయటం, గర్భిణీల సంరక్షణపై భర్తలకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు రెండేళ్లకంటే తక్కువ వయసు ఉన్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన వంటివి పూర్తి చేశారు.

కార్యక్రమం నిర్వహణపై సమావేశం

పోషణ పక్షం కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలన్నారు.

జిల్లాలో 5 ప్రాజెక్టులు.. 1,504 కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా ఐదు ప్రాజెక్టులు ఉండగా 154 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాలలో గర్భిణీలు 9,653 బాలింతలు 9,012, ఐదేళ్లలోపు చిన్నారులు 95,275 మంది ఉన్నారు. ఆయా కేంద్రాలలో పోషకాహారం కలిగిన ఆహార పదార్థాలు బాలామృతం, గుడ్లు, పాలు నిరంతరం పంపిణీ చేస్తుంటారు.



ఝరాసంగం మండలం కుప్పానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు. చిత్రంలో గ్రామస్తులు, చిన్నారులు

> **పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తాం**
>
> 
>
> గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తీసుకునే పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తాం. ప్రతీ కేంద్రం పరిధిలో పోషకాహార లోపం, తక్కువ బరువుతో జననం, ఊబకాయలోపం ఉన్న వారిని గుర్తిస్తాం. వారి పర్యవేక్షణతోపాటు పోషకాహారాన్ని అందిస్తాం.
>
> – లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారి, సంగారెడ్డి జిల్లా

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: స్వయం ఉపాధి కల్పించే వివిధ కోర్సులకు హుస్నాబాద్ పట్టణంలోని సెట్విన్ శిక్షణా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని సెట్విన్ శిక్షణ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ అమీనా భాను కోరారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మొగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, మెహందీ, బ్యూటీషన్, కంప్యూటర్ ఎలక్ట్రీషియన్ తదితర కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ కోర్సుల పై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి


ఆవు వద్ద బాధిత రైతు

చేర్యాల(సిద్దిపేట): పిడుగుపాటుతో ఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కేసిరెడ్డి సురేందర్‌రెడ్డి రోజువారి పనులు ముగించుకొని బుధవారం రాత్రి ఆవును వ్యవసాయ పొలం వద్ద కట్టేసి వెళ్లాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా పిడుగు పడి ఆవు మృతి చెంది ఉంది. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన అల్లాదుర్గం మండలం 161 రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ వైపు నుంచి పెద్దశంకరంపేట వైపు వెళ్తున్న కారు అల్లాదుర్గం సబ్ స్టేషన్ ప్రాంతంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా అంబులెన్సులో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మరో ప్రమాదంలో హైదరాబాద్ నుంచి పెద్దశంకరంపేట వైపు వెళ్తున్న బూలోరా వాహనం కాయిదంపల్లి శివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఆత్మహత్య


ధన్‌రాజ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): కుటుంబ కలహాలతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హవేళిఘణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఔరంగాబాద్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. ఔరంగాబాద్ గ్రామానికి చెందిన ఆడెపు ధన్‌రాజ్(32) ఇంట్లో కొంత కాలంగా కుటుంబ విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన ధన్‌రాజ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిషేధిత మాదకద్రవ్యాలతో జీవితాలు చిన్నాభిన్నం


అవగాహన కల్పిస్తున్న పవన సంధ్య

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో గురువారం నిషేధిత మాదకద్రవ్యాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీ పవన సంధ్య పీపీటీ ద్వారా మాదక ద్రవ్యాలు వాటి రకాలు, అందులో ఉపయోగకరమైనవి, హానికరమైనవి వివరించారు. కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ మెంబర్ బాలకిషన్ మాట్లాడుతూ.. నేటి యువత మాదకద్రవ్యాలకు ఏ విధంగా ఆకర్షితులై జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ మధుసూదన్, సీఓఈ గోపాల సుదర్శనం, ఆంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ బాలకిషన్, కృష్ణయ్య, శ్రద్ధానందం, విశ్వనాథం, రాణి, పుణ్యమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్
పోలీసుల అదుపులో ఇద్దరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఇద్దరిని రామచంద్రాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. బెల్ టౌన్‌షిప్‌లోని స్టేడియం వద్ద కొందరు ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్నారని ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. పటాన్‌చెరుకు చెందిన కృష్ణ, చిరంజీవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి ఫోన్‌లను స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. చిరంజీవి అనే వ్యక్తి బెట్టింగ్ కట్టిన వారి నుంచి నగదు తీసుకొని రంజిత్‌కు అందజేస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. కృష్ణ, చిరంజీవి నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు. రంజిత్‌కు చెందిన బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేయగా, అతడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అడుగంటిన నీళ్లు.. ఎండిన చేన్లు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు దుబ్బాక పట్టణానికి చెందిన రైతు రేపాక రాజిరెడ్డి. ఈ యాసంగిలో 4 ఎకరాల్లో వరి పంట వేశాడు. ఇప్పటి వరకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాడు. తీరా వరి పంట పొట్టదశలో ఉండగా భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీళ్లు తగ్గిపోయాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు మరో రూ.50 వేలు అప్పుతెచ్చి బోరును మళ్లీ లోతుగా కొట్టించాడు అయినా ఫలితం దక్కలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాంకర్ అద్దెకు తీసుకొని రోజుకు 10 నుంచి 12 ట్రిప్పుల చొప్పున వేరే బోరు నుంచి నీళ్లు తెచ్చి పొలంలో పోస్తున్నాడు. ఇంత తిప్పలు పడ్డా ఇప్పటికే 2 ఎకరాలకు పైగా వరి పంట ఎండిపోయింది. మిగితా 2 ఎకరాలన్నా చేతికొస్తుందన్న నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక్క రైతు రాజిరెడ్డి పరిస్థితే కాదు చాలా మంది రైతులది ఇదే గోస.

పడిపోయిన భూగర్భ జలాలు

- నీరు లేక ఎండిపోతున్న వరి పంటలు
- కాపాడుకునేందుకు రైతుల పడరాని పాట్లు
- రూ.వేలు వెచ్చించి ట్యాంకర్లతో నీళ్లు
- 60 వేలకు పైగా ఎకరాల్లో నష్టం
- పశువులకు మేతగా మారిన వైనం


దుబ్బాకలో ఎండిపోయిన వరి పంటలో గొర్రెలను మేపుతున్న కాపరి

దుబ్బాక: వరి పంటలు చేతికొస్తాయనుకుంటున్న దశలోనే నీరందక ఎండిపోతుండడంతో రైతులు కన్నీరుపెడుతున్నారు. జిల్లాలో ఈ యాసంగిలో 3.53 లక్షల ఎకరాల్లో వరి పంటలు వేయగా నీళ్లు అందక ఇప్పటికే 60 వేలకు పైగా ఎకరాల్లో ఎండిపోయినట్లు సమాచారం. వరితోపాటు మొక్కజొన్న, కూరగాయల పంటలు సైతం పెద్ద ఎత్తున ఎండిపోవడంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. జిల్లాలోని దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, భూంపల్లి-అక్బర్‌పేట, దౌల్తాబాద్, రాయపోల్, గజ్వేల్, నంగునూర్, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, వర్గల్ మండలాల్లో వేల ఎకరాల్లో చేతికొచ్చే దశలో బోర్లు నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయాయి.

పశువులకు మేతగా..

చేతికొచ్చే దశలో వరి పంటలు ఎండిపోవడంతో పశువులు, గొర్రెలకు మేతగా మారాయి. ఎండిపోయిన వరి పంటలను రైతులు తమ పశువులను మేపుతున్నారు. కొందరు రైతులు ఎండిన పంటను గొర్రెల కాపరులకు అమ్ముకుంటున్నారు. గొర్రెలను మేపడానికి ఎకరానికి రూ.2 వేల నుంచి రూ.4 వేలకు ఎండిన పంట పొలాలను కొంటున్నారు. దుబ్బాక ప్రాంతంలో ఎక్కడ చూసిన ఎండిపోయిన వరి పొలాల్లో గొర్రెలు మేపుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. పంటలు ఎండిపోయి పెట్టుబడులు మీద పడి దుర్భరపరిస్థితుల్లో ఉన్న తమకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.


చేర్యాపూర్‌లో ట్యాంకర్‌తో నీరు అందిస్తున్న రైతు

ట్యాంకర్లతో నీళ్లు..

చేతికొచ్చే దశలో ఎండిపోతున్న వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.చాలా మంది రైతులు ట్యాంకర్ల ద్వారా వేరే బోర్ల నుంచి నీళ్లు తెచ్చి పంటలు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు చెల్లిస్తున్నారు. చెరువులు, కుంటలు, ఇతర బోర్ల నుంచి, చాలా దూరం నుంచి పైపుల బెండలు వేసుకొని కంటిమీద కునుక లేకుండా రాత్రింబవళ్లు తమ పంటలకు నీళ్లు పెడుతున్నారు.

పంటలు ఎండిపోయాయి



3 ఎకరాల మొక్కజొన్న, 2 ఎకరాల్లో వేసిన వరి పంట నీళ్లు లేక ఎండిపోయాయి. మొదట్లో బోర్లు బాగానే నీరు పోయడంతో ముందుగానే 3 ఎకరాల్లో మొక్కజొన్న వేసిన. తీరా కంకులు వస్తున్న దశలో బోర్లలో నీరు తగ్గిపోయింది. ఉన్న వరి పంటకు కూడా నీరు పారుతలేదు. పెట్టుబడులు మీద పడే పరిస్థితి దాపురించింది. ఏం చేయాలో తోస్తలేదు. ట్యాంకర్లతో ఎన్ని తెచ్చిపోసిన ఫలితం లేదు.

– భూపతిరెడ్డి, రైతు

శభాష్.. పోలీస్

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి కొన ఊపిరితో ఉండగా పోలీసులు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. దేవమ్మగూడం గిరిజన తండాలో మంగళ, బుధ వారాల్లో దసరా పండుగ ఉత్సవాలు నిర్వహించుకున్నారు. తండాకు చెందిన లున్సవత్ రాజు మద్యం మత్తులో బుధవారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండటంతో అతడి అన్న 100 కాల్ చేశాడు. విధుల్లో ఉన్న శివ్వంపేట పోలీస్ స్టేషన్ బ్లూ కోర్టు సిబ్బంది విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ తండాకు చేరుకునే సరికే రాజు ఇంట్లోని గదిలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. బ్లూ కోర్టు సిబ్బంది తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా ఉరికి వేలాడుతున్నాడు. వెంటనే కిందికి దించి కొన ఊపిరితో ఉండగా విష్ణువర్ధన్‌రెడ్డి సీపీఆర్ చేయడంతో శ్వాస తీసుకున్నాడు. వెంటనే కారులో చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీపీఆర్ వల్లనే రాజుకు ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు, తండా వాసులు అన్నారు. ఈ సందర్భంగా పోలీసులను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.


సీపీఆర్ చేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

కార్పొరేటర్లకు రూ.లక్షల కోట్లు మాఫీ

- పేదల బతుకులతో మాత్రం కేంద్రం చెలగాటం
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ


సదస్సులో మాట్లాడుతున్న పద్మశ్రీ

దుబ్బాక: కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్లు మాఫీ చేస్తున్న కేంద్రం, పేద ప్రజల బతుకులతో మాత్రం చెలగాటం ఆడుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం దుబ్బాక పట్టణంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ అప్పగిస్తూ దేశ సంపదను కేంద్రం లూటీ చేస్తుందని విమర్శించారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు మారుస్తూ శ్రమదోపిడికి పాల్పడుతుందన్నారు.గ్యాస్‌పై మళ్లీ రూ.50 పెంచి పేదలను మోసం చేస్తుందన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గోపాల స్వామి, భాస్కర్, పద్మ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, శ్యామల, భారతమ్మ, శారద తదితరులు ఉన్నారు. కామ్రేడ్ విమలరనదివే జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దుకాణాలే లక్ష్యంగా వరుస చోరీలు

నిందితుడి అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

సంగారెడ్డి క్రైమ్: వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని సంగారెడ్డి పట్టణ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలో గత నెల 26న అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగ కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న సాగర్ మెడికల్ దుకాణం, కేశవ మెడికల్ దుకాణంలో చోరీకి పాల్పడి రూ.60 వేలు ఎత్తుకెళ్లాడు. మళ్లీ 30, 31 తేదీల్లో అశోక్ కిరాణా దుకాణంలో 15 లీటర్ల ఆయిల్, పలు రకాల సబ్బులు దొంగలించాడు. ఈనెల 7న స్మార్ట్ బట్టల దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీలు జరిగిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించి కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న సిమ్లా బేకరీ ఎదుట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నేరాలు ఒప్పుకున్నాడు. పట్టుబడిన దొంగ మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాద్ తండాకు చెందిన మూడవత్ అంజూ(26)గా గుర్తించారు. వెంటనే అతడి వద్ద రూ.1,370, 15 లీటర్ల ఆయిల్‌తో పాటు వివిధ రకాల షాపులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రెండు ఆటోలు ఢీ :

ఆరుగురికి తీవ్ర గాయాలు



నుజ్జు నుజ్జయిన వాహనాలు

హుస్నాబాద్: రెండు ఆటోలు ఢీ కొనడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వేలేరు గ్రామానికి చెందిన మణికంఠ, పవన్, సాయి, దిలీప్, అలుగునూర్‌కు చెందిన గణేశ్ పట్టణంలోని ఆరపల్లె వద్ద జరిగిన ఓ శుభకార్యానికి వచ్చారు. కొద్దిసేపటికి పని నిమిత్తం ఆటోలో బస్టాండ్‌కు వెళ్లారు. ఇదే సమయంలో సిద్దిపేట రోడ్ నుంచి కరీంనగర్‌కు మహీంద్ర మాక్సిమో ఆటో వాహనం వెళ్తుంది. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొని నుజ్జు నుజ్జయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, మాక్సిమోలో ఉన్న విజయ్ అనే యువకుడి కాలు విరిగింది. ఐదుగురు క్షతగాత్రులను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, విజయ్‌ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని పెద్ద చెరువుకు, కూడవెల్లి వాగుకు అనుసంధానంగా ఉన్న నాగయ్య వాగుపై ఏర్పాటు చేసే బ్రిడ్జి నిర్మాణం కోసం గురువారం భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ప్రాంతానికి తాను ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు అక్బర్‌పేట-భూంపల్లిని కొత్త మండలంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే సిద్దిపేట-మెదక్ జాతీయ రహదారి ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులను ఢిల్లీ వరకు తీసుకెళ్లి వారికి నష్ట పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. ప్రతీ మండలానికి రోడ్డు డివైడర్లు, ప్రతీ గ్రామానికి హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మెదక్ ఎంపీగా గెలుపొందిన 10 నెలల కాలంలో రూ. 2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేసినట్లు తెలిపారు. 7 నియోజకవర్గాలకు 7 అంబులెన్సులు ఇప్పించానన్నారు. ప్రస్తుతం అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ప్రతీ గ్రామానికి సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు మండల పరిధిలోని లక్ష్మీనగర్ గ్రామం నుంచి దుబ్బాక మండలం హబ్షీపూర్ వరకు నిర్మించే రోడ్డుకు త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు ఎల్ముల దేవరాజు, మద్దెల రోశయ్య, టెలికాం బోర్డు మెంబర్ మల్లేశం, మండల అధ్యక్షుడు జిగిరి అమర్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల డబ్బులు లీడర్లు స్వాహా

- అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళా సంఘం సభ్యులు
- పుల్లూరు గ్రామంలో వెలుగులోకి..

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా రుణాలను అందిస్తున్న క్రమంలో వాటిని కొందరు మహిళా సంఘాల లీడర్లు స్వాహా చేస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఈ ఘటన పుల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన కనకదుర్గా మహిళా సంఘం సభ్యులు తమ డబ్బులను లీడర్లు సొంతానికి వాడుకున్నారని గురువారం వాగ్వాదానికి దిగారు. 25 ఏళ్లుగా సంఘాన్ని నడుపుకుంటూ వస్తున్నామన్నారు. గ్రూప్‌లో లీడర్లుగా వ్యవహరిస్తున్న రూపా, రాజమణి తమకు తెలియకుండా సీఏ ఉమతో కలిసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. శ్రీనిధి లోన్‌లో రూ. 4 లక్షల 77 వేలు, వెలుగులో రూ.2 లక్షల 80 వేలు, సీసీ లోన్‌లో రూ.3 లక్షల రుణం తీసుకొని తమను మోసం చేశారన్నారు. విషయం తెలుసుకొని రికార్డులు చూపించాలని కోరగా చూపించడం లేదన్నారు. ఈ విషయమైన న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వట్‌పల్లి(అందోల్): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన అందోలు మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి కిష్టయ్య (43) బుధవారం సాయంత్రం చేపలు పట్టేందుకు గ్రామ శివారు ప్రాంతంలోని మంజీరా నదికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం మంజీరా నదిలో చేపల వల చుట్టుకొని నీటిలో మునిగి మృత్యువాత పడినట్లు గుర్తించారు. మృతుడి తల్లి భూమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు దాటుతున్న రైతును టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన జోగిపేట ప్రధాన రహదారి ఎనగండ్ల శివారు ప్రాంతంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మండలంలో రంగంపేట గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య(55) బుధవారం సాయంత్రం పాడి గేదెలకు మేత తెచ్చేందుకు పొలానికి వెళ్లాడు. గడ్డి కోసుకొని మూటను నెత్తిపై పెట్టుకొని రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో దుంపలకుంట చౌరస్తా వైపు నుంచి వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఎల్లయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మెప్మా ఉద్యోగులపై వేటు

- నిబంధనలు ఉల్లంఘన
- ప్రధాన కార్యాలయానికి సరెండర్

సిద్దిపేటజోన్: నిబంధనలు ఉల్లంఘించి విధివిధానాలను అతిక్రమించిన సిద్దిపేట మున్సిపల్ మెప్మాలో పని చేసే ఇద్దరు ఉద్యోగులపై కలెక్టర్ వేటు వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వారిని రిలీవ్ చేయడం, మెప్మా హెడ్ ఆఫీసుకు సరెండర్ చేయడం చకచకా సాగిపోయాయి. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని స్లమ్ సమాఖ్యకు చెందిన ఓ స్వయం సహాయక సంఘం(ఎస్‌హెచ్‌జీ)లోని సభ్యురాలి పేరు డిలీట్ అంశంపై టౌన్ మిషన్ కో ఆర్డినేటర్(టీఎంసీ) సాయికృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమ్య ఏకపక్షంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. సంబంధించిన అంశంపై మెప్మా జిల్లా మిషన్ కో ఆర్డినేటర్(డీఎంసీ) హన్మంతారెడ్డి ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌ను విచారణ అధికారిగా నియమించారు. విచారణకు సంబంధించి నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వారిని సిద్దిపేట బల్దియా నుంచి రిలీవ్ చేసి సరెండర్ చేశారు.

రక్త పరీక్షే..

వారం రోజులుగా నిలిచిన ముఖ్యమైన టెస్టులు

- టీ హబ్‌లో అందుబాటులో లేని కెమికల్స్
- ఈ కారణంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అరకొరగా శాంపిల్స్ సేకరణ
- జిల్లాలోని 53 హెల్త్ సెంటర్లకు ఇదే ప్రధాన కేంద్రం
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఇబ్బందులు పడుతున్న రోగులు


టీ హబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలోని టీహబ్‌లో రోగ నిర్ధారణకు కెమికల్స్ అందుబాటులో లేకపోవడంతో పలు ముఖ్యమైన పరీక్షలు నిలిచిపోయాయి. జిల్లాలోని 53 ఆరోగ్య కేంద్రాల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను ఈ టీహబ్‌కు పంపిస్తుంటారు. టీహబ్‌లో రోగ నిర్ధారణ కోసం ఉపయోగించే కెమికల్స్ లేకపోవడంతో ఎల్ఎఫ్‌టీ (లివర్ ఫంక్షనింగ్ టెస్ట్), కాల్షియం, లిపిడ్ ప్రొఫైల్, హెచ్‌బీ ఏఐ సీ (షుగర్ లెవెల్స్), ఎస్ టైఫాయిడ్ వంటి ముఖ్యమైన పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో పరీక్షల కోసం వచ్చిన పేషెంట్స్ ఇబ్బందులు పడుతున్నారు. మరి కొంత మంది ప్రైవేటు ల్యాబ్స్‌కు వెళ్తున్నారు.

53 కేంద్రాల నుంచి శాంపిల్స్ సేకరణ

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ 300 పడకల జనరల్ ఆస్పత్రి ఆవరణలో టీహబ్‌ను 2021లో ఏర్పాటు చేసి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రి, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానల నుంచి ప్రతి రోజూ పేషెంట్ల నుంచి రక్త నమూనాలు (బ్లడ్ శాంపిల్స్) సేకరించి ఐదు రూట్ల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల ద్వారా టీ హబ్‌కు పంపిస్తారు. ఇలా ప్రతి రోజూ 53 కేంద్రాల నుంచి శాంపిల్స్ సేకరించి 115 రకాల పరీక్షలు చేస్తారు. వివరాలు టీహబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరీక్షల అనంతరం మరుసటి రోజు పేషెంట్ మొబైల్ నంబర్‌కు ఫలితాలు పంపిస్తారు. ఈ రిపోర్టుల ఆధారంగా పేషెంట్లు వైద్య సేవలు పొందుతారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం గత ప్రభుత్వ హయాంలో టీ హబ్‌ను కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పలు యంత్రాలు కొనుగోలు చేసి, సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నారు.

కెమికల్స్ లేకపోవడంతోనే..

టీహబ్‌లో పలు రకాలు పరీక్షలు నిలిచిపోవడంతో పేషెంట్లు, ప్రజలు వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారు. ఈ కారణంతో పలు ముఖ్య పరీక్షలు ఆగిపోయాయి. పరీక్షలు ఎప్పుడు జరుగుతాయని సిబ్బందిని అడిగితే కెమికల్స్ లేవనే సమాధానం చెబుతున్నారని.. ఎప్పుడు వస్తాయో తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పలువురు పేషెంట్లు చెప్పుకొచ్చారు. జిల్లా నుంచి రోజు సుమారు 500 నుంచి 600 మంది నుంచి శాంపిల్స్ సేకరిస్తారు. వీటిలో హెచ్‌బి, టైఫాయిడ్, డెంగీ, ఇతర విష జ్వరాలు, థైరాయిడ్, విటమిన్‌లు, రక్త కణాలు, కిడ్నీ, లివర్, కొలెస్ట్రాల్ వంటి మొత్తం 115 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. వారం రోజులుగా కెమికల్స్ అందుబాటులో లేకపోవడంతో ముఖ్యమైన 15 రకాల పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. గత ప్రభుత్వ హయాంలో స్థానికంగా వైద్యారోగ్యశాఖ మంత్రి ఉండటంతో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించారు. కానీ ప్రస్తుత పరిస్థితులలో వైద్యారోగ్యశాఖ మంత్రి వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించపోవడంతో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది సైతం సమయ పాలన పాటించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టీహబ్‌లో అన్ని రకాల పరీక్షలు జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

కెమికల్స్ రాగానే చేస్తాం

టీ హబ్‌లో రోగ నిర్ధారణ పరీక్షల కోసం వినియోగించే కెమికల్స్ కోసం ఇప్పటికే ఇండెంట్ పెట్టడం జరిగింది. కెమికల్స్ రాగానే అన్ని రకాల పరీక్షలు జరుగుతాయి. జీజీహెచ్‌లోని ఓపీ, ఐపీ పేషెంట్లకు పరీక్షలు నిర్వహిస్తున్నాం. పీహెచ్‌సీల నుంచి వచ్చే శాంపిల్స్‌కు మాత్రం కావడం లేదు. మరో రెండు, మూడు రోజుల్లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి వస్తాయి.

– అనిల్, నోడల్ ఆఫీసర్